క్లుప్తంగా

వైద్యుడి నియామకం


డాక్టర్ రవి

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యుడిగా రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ కర్నూలుకు బదిలీ అయ్యారు. వైద్యాధికారులు ఆయన స్థానంలో డాక్టర్ రవిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానన్నారు. వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలన్నారు.

హోటళ్లలో శుభ్రత పాటించాలి


పట్టణంలోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హోటళ్లలో శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఆదోని రోడ్డులోని జీప్ మెస్ట్రో హోటల్‌లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్లో సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని, అలాగే కల్తీ నూనెలు వాడరాదని హెచ్చరించారు. హోటల్‌కు ట్రేడ్ లైసెన్స్ అనుమతులపై ఆరా తీసి ఆ మేరకు చర్యలు తీసుకోని శానిటరీ సెక్రటరీకి మెమో జారీ చేశారు. డీఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి


నబిరసూల్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని నదికై రవాడి గ్రామ సమీపంలోని పొలాలలో విద్యుదాఘాతానికి గురై నబిరసూల్ (38) అనే కాంట్రాక్ట్ కూలీ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నదికైరవాడి గ్రామ సమీపంలోని డాక్టర్ రమేష్ పొలంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో మరమ్మతు పనులు చేసేందుకు విద్యుత్ అధికారులు కాంట్రాక్టు కూలీలను తీసుకొచ్చారు. స్తంభాలకు ఉన్న తీగలను మారుస్తుండగా విద్యుదాఘాతానికి గురై నబిరసూల్ అక్కిడిక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నబిరసూల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

యార్డు ఆదాయం పెంపునకు కృషి చేయండి

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో సిబ్బందితో మార్కెట్ ఆదాయం తదితర అంశాలపై చర్చించారు. ఆదాయం పెంపుపై పలు సూచనలిచ్చారు. యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

24న మండల సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: ఈ నెల 24వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ బుధవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీ శేఖర్, అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక టౌన్ బ్యాంక్‌లో బుధవారం సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని టౌన్‌బ్యాంక్ ఆవరణలో డైరెక్టర్ సయ్యద్‌చాంద్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. బ్యాంక్ అభివృద్ధికి పాలకవర్గంతో పాటు సిబ్బందితో సమష్టి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. టౌన్ బ్యాంక్ సీఈఓ గంగాధర్, డైరెక్టర్లు సయ్యద్‌చాంద్, మహనందయ్య, రజాక్, తట్టె బుడ్డప్ప ,వడ్డె రంగన్న, పల్లవి రాజశేఖర్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్: కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. వివరాలు.. కోడుమూరుకు చెందిన శ్రీనివాసులు, నగరూరు గ్రామానికి చెందిన వీరేష్ ఇద్దరూ కారులో నగరూరు నుంచి కోడుమూరుకు వెళ్తున్నారు. ఆస్పరి గ్రామ సమీపంలో కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎర్రకోట జగన్


చుంచుఎర్రగుడి సచివాలయంలో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


మద్దికెరలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు


హాలిగేరలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ లింగమ్మ


ఆలూరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నారాయణస్వామి

సంక్షేమ పాలనకు పట్టం కడదాం



సోమప్పనగర్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, పత్తికొండలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


కరివేముల గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు


గూళ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


దొల్తాపురంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి


చెన్నంపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర అభివృద్ధి, పేద బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 23వ వార్డు సచివాలయం పరిధిలోని సోమప్ప నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికే సంక్షేమ పథకాలు వర్తించేవన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. సంక్షేమ పథకాలతో సమానంగా అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తూ నాలుగున్నరేళ్లలోనే ఎంతో ప్రగతి సాధించినట్లు వివరించారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రతి కుటుంబం కోరుకుంటోందన్నారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతు ఇచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ బంగి శ్రీరాం, కౌన్సిలర్ చెన్నమ్మ, సిద్దా శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలోని గ్రామ సచివాలయం-1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల డాష్ బోర్డును ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆవిష్కరించారు. గడిచిన నాలున్నరేళ్లలో గ్రామ సచివాలయం-1 పరిధిలోనే వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.34.90 కోట్లు అందజేసినట్లు వివరించారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీల పేరిట దోచుకున్నారని విమర్శించారు. అనంతరం పార్టీ నాయకులు, శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి వాల్మీకి మహర్షి విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చాంద్‌బాషా, సర్పంచులు మునెమ్మ, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్ సమీపంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ దళారుల ప్రమేయం, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను నేరుగా బ్యాంక్ ఖాతాలకే జమ చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, ఆయా వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం-4లో సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని హాలిగేర సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ లింగమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ సూర్యనరసింహా రెడ్డి మాట్లాడుతూ హాలిగేర సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.22 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. పంచాయతీ కార్యదర్శి చిన్న వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, నాయకులు మూలింటి రాఘవేంద్ర, బసవరాజు, పురుషోత్తంరెడ్డి, సుంకర రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను సర్పంచ్ ఆవిష్కరించారు.

ఆలూరు: స్థానిక సచివాలయం-4లో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆవిష్కరించారు. సంక్షేమ పాలన కొనసాగేందుకు వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ వీరేష్, కో కన్వీనర్ హనుమయ్య, జేసీఎస్ కన్వీనర్ ఈరన్న, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. పార్టీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, నాయకులు దివాకర్‌నాయుడు, శ్రీను, తెర్నెకల్ సర్పంచ్ అరుణకుమార్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామ సచివాలయం-2 పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమప్పచౌదరి, సర్పంచ్ ఉలిగమ్మ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. నాయకులు పరశురామ్, శ్రీనివాసులు, రంజిత్, దిబ్బలింగ, ఎ.సోమన్న, కురువ కార్పొరేషన్ చైర్మన్, బజారప్ప, ఈఓఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలోని ధొల్తాపురం గ్రామంలో సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత టీడీపీ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడాను ప్రజలకు వివరించారు. జగనన్న పాలనలో అందించిన సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ నరసింహులు, ఈఓపీఆర్డీ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: పేదలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు నాగేష్ పిలుపునిచ్చారు. బుధవారం చెన్నంపల్లిలో పార్టీ నాయకుడు రంగనాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ రంజాన్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. నాయకులు జగన్నాథరెడ్డి, బసిరెడ్డి, మోహన్‌రెడ్డి, నాగభూషణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

కృష్ణగిరి: నాలుగున్నరేళ్లలో మాటల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి చూపించి పేదల తలరాత మార్చిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే బడుగు, బలహీన వర్గాల భవిష్యత్తు కోసం మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో బుధవారం వారు సర్పంచ్ మాదేమ్మ, కురుబ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కురువ సుకన్య, పార్టీ మండల, యూత్ కన్వీనర్లు ఆర్‌బీ వెంకటరాముడు, లక్ష్మీకాంతరెడ్డితో కలిసి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డు ఆవిష్కరణ అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. నాయకులు భీమిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సంగాల గిడ్డయ్య, హనుమంతు, రామకృష్ణ, జనార్దన్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

పత్తికొండటౌన్: సంక్షేమ పాలన నిరంతరాయంగా కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ జిల్లా పరిశీలకుడు పి.రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. పత్తికొండ గ్రామసచివాలయం-4 పరిధిలో బుధవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ నాయకులతో కలసి టీచర్స్ హోం కాలనీ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 99 శాతం హామీలను నెరవేర్చాడన్నారు. విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాడన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు నీలకంఠ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, నాయకులు నాగరత్నమ్మ, శ్రీరంగడు, సోమశేఖర్, కారం నాగరాజు, టైలర్ రంగన్న, వెంకటేశ్వరరెడ్డి, హనీఫ్, హుసేన్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన


మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గోనెగండ్ల: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోనెగండ్ల 10వ వార్డులో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని గణాంకాలతో వివరించారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల సంక్షేమ పథకాల వివరాలతో బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి పక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించి, సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని కోరారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, కన్వీనర్ దొరబాబు, ఎంపీటీసీ రఫీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిక్కయ్య స్వామి, కౌలుట్లయ్య స్వామి, ఓబులయ్య, పద్మనాభం, రహిమాన్, ఖాజాపటేల్, మాబువలి, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా శనగ సాగు


ఆస్పరి సమీపంలోని నల్లరేగడి పొలాల్లో ట్రాక్టర్‌తో శనగ విత్తనం వేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలో ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు రైతులు పప్పు శనగ సాగు చేపట్టారు. నల్లరేగడి భూములున్న ఆస్పరి, జొహరాపురం, చిన్నహోతూరు, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హాలిగేర, బిణిగేరి, చిగిళి, నగరూరు గ్రామాలలో రైతులు ట్రాక్టర్ల ద్వారా శనగ విత్తనం విత్తుతున్నారు. విత్తనం సాగుకు అదును దాటిపోతుందనే సమయంలో ఓ మోస్తరు వర్షాలు కురువడంతో విత్తనం వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో రబీ సీజన్‌లో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 1600 ఎకరాల్లో రైతులు విత్తనం వేశారు. పొలాల్లో పదునుంటే ఈ నెలాఖరు వరకు శనగ విత్తనం వేసుకోవచ్చని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు.

నేడు కార్యాలయాల ప్రారంభోత్సవం


అమకతాడులో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్


నగరదోణలో నిర్మించిన గ్రామ సచివాలయం

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను గురువారం ప్రారంభించనున్నట్లు పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ సాహెబ్ తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రహదారిని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామంలో రూ.39 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 17న గ్రామంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా సచివాలయం భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం జరిగే ప్రారంభోత్సవంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పుస్తక ప్రదర్శన

ఆస్పరి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం లైబ్రేరియన్ విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయల్లో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానం పెంచుకోవాలన్నారు. యువత గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు. పాఠకులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుడితే రూ.6 వేలు సాయం

మద్దికెర: రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే ప్రధాన మంత్రి సురక్షా యోజన పథకం కింద రూ.6 వేలు తల్లుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. 2022 ఏప్రిల్ 2 తరువాత జన్మించిన ఆడపిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలని సూచించారు.

పెన్షనర్లకు వైద్య చికిత్సలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఎమ్మిగనూరు యూనిట్ కార్యాలయంలో బుధవారం శ్రీచక్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు సురేష్, కంటి వైద్యులు అశోక్ పెన్షనర్లకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారిని శస్త్ర చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఏపీ వీరన్న, కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి శివ సర్కిల్ వరకు జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అలాగే పట్టణంలోని అబ్బాస్ టాకీస్ ఏరియా, ఎస్సీ శ్మశాన వాటిక ప్రాంతం, టీబీపీ కాలనీ, ఎస్ఆర్‌కే కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి ఆయా పనులను సత్వరం పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, ఏఈలు శరత్, మదన్ తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

మద్దికెర: స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఆలయ నిర్వాహకులు విజయ్ ప్రసాద్ ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిని బుధవారం శాలువా కప్పి స్వామి వారి చిత్ర పటాలను అందజేశారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తున్న వైద్యులు శ్రీలక్ష్మి, రాగిని, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సిబ్బంది ప్రభాషావ్, అంజలి తదితరులను సన్మానించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


పెద్దహుల్తిలో కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో రూ.42 లక్షలతో చేపట్టి పూర్తిచేసిన పనులను బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచు విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. రూ.10 లక్షలు ఎమ్మెల్యే నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో పాటు, మొదటి దశ జలజీవన్ కింద రూ.22 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు పూర్తికావడంతో శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి కొళాయిలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. ఎంపీపీ నారాయణదాస్, పంచాయతీ రాజ్ ఎఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివారి ఊరేగింపు


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో కొలువైన శ్రీహుల్తి లింగేశ్వర, కారుమంచి స్వామి ఉత్సవాలు బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అత్యంత వైభవంగా జరిగిన వేడుకలకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామ పురవీధుల్లో భక్తుల కోలాహలం, బీరప్ప డోళ్లు, గొరవయ్యల సంప్రదాయ నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం భక్తజన సందోహం మధ్య ప్రధాన ఆలయం వరకు కమనీయంగా సాగింది. ఆలయం ముందు స్వామివారి కాలి స్పర్శ కోసం భక్తులు బోర్లా పడుకున్నారు. స్వామివారు కాలిస్పర్శతో తమ కష్టాలు తీరుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తాదులకు అన్నదానం చేశారు.

బస్టాండ్ ఆధునికీకరణకు శ్రీకారం

ఆలూరు: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆధునికీకరణ పనులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గురువారం ఉదయం భూమి పూజ చేసి ప్రారంభిస్తారని ఆదోని డిపో మేనేజర్ వి.ఎస్.ఎండీ రఫీక్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామనాయకులు, తదితరులు పాల్గొనాలని డిపో మేనేజర్ రఫీక్ కోరారు.